క్లుప్తంగా

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



సంక్షేమ వసతి గృహాల సమస్యపై కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి నేతలు

ఉరవకొండ: నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను విద్యార్థి సంఘాల నేతలు శుక్రవారం కోరారు. జీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాకే పురుషోత్తం , రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, వంశీ తదితరులు మాట్లాడుతూ చాల సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వారానికి రెండు రోజులు కూడా విధులకు హాజరుకాలేదన్నారు.

వలంటీర్ల భవిష్యత్తుపై నిర్లక్ష్యం తగదు



'వలంటీర్ల ఆవేదన' పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: రాష్ట్రంలోని 2.60 లక్షల మంది వలంటీర్ల భవిష్యత్తుపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదని, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొ్ట్రేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న విజయవాడలో వలంటీర్ల ఆవేదన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వలంటీర్ల ఆవేదన కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఆంజనేయులు, నవీన్, తేజ, విజయ్, అఖిలేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాజ సూర్యుడు శుక్రవారం తెలిపారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో జరగనున్న ఎస్జీఎఫ్ఐ అండర్–14 ఖోఖో బాలుర విభాగంలో 8వ తరగతి విద్యార్థి డి.వంశీ, 9వ తరగతి విద్యార్థి హెచ్.బి చిన్న ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్ఎం రాజసూర్యుడు, వ్యాయామ ఉపాధ్యాయులు జనార్దన్, శివకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల నూతన కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

బెళుగుప్ప:మండలంలోని ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అసోషియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.శివశంకర్ నేతృత్వంలో మండల అధ్యక్షులుగా హేమనాథ్, ఉపాధ్యక్షులుగా లాలుస్వామి, కార్యదర్శిగా గుండ్లపల్లి రాజశేఖర్, సహాయ కార్యదర్శి గంగవరం అనిల్‌కుమార్, కోశాధికారిగా బి.ధనుంజయ మరో ఐదుగురు సభ్యులుగా ఎన్నుకున్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘ కార్యాలయంలో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లలోకి అడుగు పెట్టాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి. డోర్లు సైతం ఊడిపోయాయి. ఏమాత్రం శుభ్రం చేయకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయంలోనే పరిస్థితి ఇలా ఉంటే పట్టణాన్ని పరిశుభ్రంగా ఏం ఉంచుతారని ప్రజలు అంటున్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

కంబదూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. కార్యాలయంలోని గదుల పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. దీంతో కార్యాలయంలో పని చేసే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దెబ్బతినింది. వర్షం పడిదంటే చాలు కార్యాలయం మొత్తం ఉరుస్తోంది.

శివకేశవులకు ప్రీతికరం..కార్తీక మాసం

శివకేశవులకు ప్రీతికరం కార్తీక మాసం.. ఈనెలలో అన్ని ఆలయాలు, నదీతీరాలు, ఇళ్లల్లోనూ దీపాలు వెలిగించడం పుణ్యప్రదమని కార్తీక పురాణం చెప్తోంది. దీప దర్శనం, దీపదానం, దీప ప్రకాశనం ఈ మాసంలో ఎంతో పుణ్యాన్నిస్తాయని భక్తులకు విశ్వాసం. కార్తీక మాసం శనివారం (నవంబర్ 2) నుంచి ప్రారంభం కానుంది. డిసెంబర్ 1 వరకు జరిగే ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. ప్రత్యేక సోమవారాలు, ఏకాదశి, శనివారంతో పాటు ఈ నెల రోజులూ పుణ్యదినాలేనని అర్చకులు చెప్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో కార్తీక శోభ సంతరించుకుంది.



రాయదుర్గంలో తొలి పూజకు సిద్ధమైన నీలకంఠేశ్వరుడు



కోటలో వెలసిన జంబుకేశ్వర స్వామి మూలవిరాట్



ఆలయాల్లో దీపారాధన చేస్తున్న మహిళలు

- నేటి నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ముస్తాబైన శైవక్షేత్రాలు

రాయదుర్గం : కార్తీక మాసంలో నదీ స్నానం, దాన ధర్మాలు, ఉపవాసాలు, పూజలు, వ్రతాలు, నోములకు కూడా ఈ మాసంలో ఎంతో ప్రాధాన్యం ఉంది.

కార్తీక మాస విశిష్టత ఇలా..

కార్తిక శుద్ధ పాడ్యమికి బలి పాడ్యమి అని పేరు. ఈ రోజున బలి చక్రవర్తిని పూజించి దానం చేస్తే సంపదలు తరగవని చెబుతారు. మరుసటి రోజు 'భగినీ హస్త భోజనం' చేస్తారు. దీన్నే యువ ద్వితీయ భ్రాత ద్వితీయ అని కూడా అంటారు. ఈ రోజున మహిళలు సోదరులు, సోదర వర్గసైన వారిని ఇంటికి పిలిచి స్వయంగా వంటచేసి వడ్డిస్తారు. శుద్ధ చవితిని నాగుల చవితిగా చేసుకుంటారు. శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశికి ఉత్థాన ఏకాదశి అని పేరు. ఆ మరుసటి రోజుకు క్షీరాబ్ధి ద్వాదశి అని పేరు. శుద్ధ చతుర్దశికి వైకుంఠ చతుర్దశి అని పేరు. ఈ రోజున మహావిష్ణువు పరమశివుణ్ని పూజించారని నానుడి. కార్తీక పౌర్ణమిని పరమ శివుడు త్రిపురాసులను సంహరించిన రోజుగా చెబుతారు. ఈ రోజున శివాలయాల్లో జ్వాలా తోరణోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మాసంలో దీపారాధన అత్యంత కీలకం. ఆవు నెయ్యి, నువ్వుల నూనె, ఆముదం, విప్పనూనె వంటి వాటితో కూడా దీపారధన చేస్తారు.

రాయదుర్గంటౌన్: పవిత్ర కార్తీకమాసం వచ్చిందంటే శైవ క్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయి. ఈ మాసంలో నిత్య ధూపదీప నైవేద్యాలతో మహాశివుడు విశేష పూలందుకుంటాడు. శనివారం నుంచి పట్టణంలోని శివాలయాలతోపాటు ప్రముఖ ఆలయాల్లో కార్తీక మాస పూజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభం కానున్నాయి. ఆలయ నిర్వాహకులు కార్తీక పూజలకు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. స్థానిక కోటలో వెలసిన నగరేశ్వరస్వామి ఆలయంలో నెల రోజుల పాటు ప్రాకారోత్సవం, సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, కార్తీక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. జంబుకేశ్వరస్వామి, మార్కండేయస్వామి, చెన్నవీరస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, శంకరమఠం, చంద్రమౌళీశ్వరస్వామి, రేవణసిద్ధేశ్వర, హటకేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, దీపాలంకరణలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన కమల మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు పూజలు జరగనున్నట్లు ఆలయ ఈఓ దాసు, అర్చకులు శుక్రవారం తెలిపారు. రోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటలకు వరకు ఏకవార రుద్రాభిషేక పూజలు, ప్రతి సోమవారం ఏకాదశ వార రుద్రాభిషేకం, ఉదయం 10 గంటల నుంచి తీర్థ ప్రసాద వినియోగం జరగనుందని తెలిపారు.

బ్రహ్మసముద్రం : శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. శివుడికి ప్రీతికరమైన మాసం కావడంతో సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారు. మండలంలోని సూగేపల్లి చెన్న మల్లేశ్వర ఆలయం, భైరసముద్రం రుద్రలింగేశ్వర స్వామి ఆలయం , బ్రహ్మసముద్రం, గుండిగానిలపల్లి, కన్నేలపల్లి, కుర్రగుండ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక మాస పూజలు ప్రారంభం కానున్నాయి.

వజ్రకరూరు:జరుట్లరాంపురంలో దక్షిణకాశీగా పిలువబడుతున్న జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి కార్తీకమాస పూజలు ప్రారంభంకానున్నాయి. ఆలయాన్ని అలంకరించారు.



కంబదూరులోని మల్లేశ్వరస్వామి ఆలయం



సూగేపల్లి చెన్న మల్లేశ్వర స్వామి ఆలయం

ఈ మాసం ఎంతో పవిత్రమైంది

కార్తీక మాసం లో వచ్చే ప్రతి దినం పుణ్యఫలంగా భావాలి. దీపారాధన ఎంతో ప్రాముఖ్యతగా చెప్పుకోవచ్చు. శనివారం ప్రారంభమై డిసెంబర్ 1తో కార్తీక మాసం ముగుస్తుంది. కార్తీక మాసం అంటేనే శివ, కేశవులకు ప్రీతికరం. భక్తి శ్రద్దలతో పూజించే వారికి వారి అనుగ్రహం తప్పక లభిస్తోందని పురాణాలు చెప్తున్నాయి. ముందుగా కార్తీక మాసం ఏం చేయాలి..? ఏం చేయకూడదనే విషయాలు స్పష్టంగా తెలుసుకోవాలి. నియమ నిష్టలతో పూజిస్తే ప్రతిఫలం దక్కుతుంది.

– ప్రసన్నస్వామి, అర్చకుడు, రాయదుర్గం

సర్వర్ సమస్యతో పింఛన్ లబ్ధిదారుల అవస్థలు



కూడేరు: సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్ లబ్ధిదారులు

కూడేరు: సర్వర్ సమస్య శుక్రవారం సామాజిక భద్రత పింఛన్ లబ్ధిదారులను అవస్థలకు గురి చేసింది. మండల వ్యాప్తంగా ఈ నెలకు సంబంధించి అన్ని రకాల పింఛన్ లబ్ధిదారులు 5,600 మంది ఉండగా, రూ. 2,40,95000 నగదు మంజూరయ్యింది. ఉదయాన్నే సచివాలయ, ఇతర శాఖ సిబ్బంది పింఛన్ నగదు పంపిణీని ప్రారంభించగా కొద్ది సేపు పని చేసి సర్వర్ సమస్య తలెత్తడంతో పంపిణీ ఆగింది. మధ్యాహ్నం 12 గంటల వరకు పని చేయలేదు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు చేరుకొని పండిగాపులు కాచారు. ఆ తర్వాత ఆలస్యంగా సర్వర్ సమస్య తీరడంతో నగదు పంపిణీని ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ చౌదరి పంపిణీని పర్యవేక్షించారు.

వల్లభాయ్ పటేల్ గొప్ప దార్శనికుడు



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈఓఆర్‌డీ గౌస్‌సాహెబ్, కార్యదర్శులు

ఉరవకొండ:ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్ప దార్శనికుడని ఉరవకొండ ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ గౌస్‌సాహెబ్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సర్దార్ వల్లభాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి ఈఓఆర్‌డీ, గ్రామ కార్యదర్శిలు కలిసి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉరవకొండ మేజర్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో తెగుళ్లకు చెక్



ఇప్పేరు వద్ద కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు నారాయణ స్వామి, నటరాజ్

కూడేరు: ముందస్తు చర్యలతో కంది పంటలో తెగుళ్ల అరికట్టొచ్చని రేకులకుంటకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు నారాయణ స్వామి, నటరాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇప్పేరులో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. వారు కంది పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఎంత విస్తీర్ణంలో రైతులు కంది పంట సాగు చేశారని ఏఓ విజయకుమార్‌తో ఆరాతీశారు. 8,250 ఎకరాల్లో కంది సాగు చేసినట్లు ఏఓ తెలిపారు. కంది పంటలో మచ్చల పురుగు కనిపిస్తే లీటర్ నీటిలోకి 0.3ఎంఎల్ స్పైనోసాడ్ లేదా 0.4 గ్రాములు ఇమా మెక్టిన్ బెంజోయెట్ లేదా 0.3 ఎంఎల్ క్లోరంట్రనిలిప్రోల్ మందు ద్రావణాన్ని మొక్కలు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. శనగ పచ్చ పురుగు లేదకాయ, పూత దశలో ఆశించినపుడు 0.5 గ్రాముల ఇమా మెక్టిన్ బెంజాయెట్ లేదా 0.3 ఎంఎల్ క్లోరాంట్రనిలిప్రోల్ మందును పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్



రాయదుర్గం ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ పాల్ రవికుమార్

రాయదుర్గంటౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ పాల్ రవి కుమార్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో వైద్య సేవలపై విచారించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటిండెంట్ మెర్సి జ్ఞానసుధ, ఆస్పత్రి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే నెల జరిగే వైద్యుల రిక్రూట్‌మెంట్‌లో వైద్య పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. ఇటీవల సరెండర్ చేసిన నలుగురు వైద్యుల విషయమై విలేకర్లు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన మాట్లాడుతూ సరెండర్ చేసిన వైద్యులు మళ్లీ బాధ్యతలు స్వీకరించేందుకు అంగీకరించారని, వారు వస్తే వైద్య సేవలు మెరుగుపడుతాయని చెప్పారు.

మెరుగైన సేవలందించేందుకు చర్యలు

కణేకల్లు: కణేకల్లు సీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీని డీసీహెచ్ఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది అందజేస్తున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అటెండన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఓపీ వేళల్లో డాక్టర్లందురూ తప్పక విధులకు హాజరు కావాలని, లేకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ రిపోర్ట్ అక్టోబర్ 1 నుంచి 31 వరకు తెప్పించుకొని పరిశీలించారు. ఓపీ 300కు మించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన... ఓపీ సేవలు ఇంకా పెంచాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీహెచ్‌సీలో వైద్యసేవల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్సరే ప్లాంటు కూడా ఇటీవల వినియోగం తెచ్చామన్నారు. అర్థో సమస్య ఉంటే వెంటనే ఎక్సరే తీసి అవసరమైన చికిత్సలం దిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉరవకొండ విద్యార్థుల ప్రతిభ



ఉరవకొండ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో అద్భుత ప్రతిభ చూపి, బంగారు, వెండి పతకాలు సాధించారు. పీడీ మారుతీప్రసాద్ సారథ్యంలో అక్టోబర్ 5 నుంచి 7 వరకు వినుకొండలో ఏపీ స్కూల్ గేమ్స్ నిర్వహించారు. రాష్ట్ర స్థాయి అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన అఖిల, రూప పాల్గొని సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. అక్టోబర్ 8 నుంచి 9 వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 సెపక్‌తక్రా పోటీల్లో అనంతపురం జిల్లా జట్టులో పాల్గొన్న అమృత బంగారు పతకాన్ని సాధించింది. అక్టోబర్ 28 నుంచి 29 వరకు కోనసీమ జిల్లా కలికిపురంలో జరిగిన అండర్–17 బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన విజయవాణి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి సిల్వర్ మెడల్ సాధించింది. అక్టోబర్ 25 నుంచి 27 వరుకు సత్యసాయి జిల్లా హిందూపురంలో నిర్వహించిన అండర్–14 ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో శాంతి, వంశీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన మొత్తం 16 మంది రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్, సెపక్‌తక్రా, బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొని ఏడుగురు పతకాలు సాధించినట్లు హెచ్ఎం రాజేశ్వరి తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచేలా శిక్షణ ఇచ్చిన పీడీలు మారుతీప్రసాద్, కిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

కణేకల్లు: మండలంలోని కోళకుర్తి గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న హరిజన ఎర్రిస్వామి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని నుంచి 10 లీటర్ల నాటుసారా స్వా. దీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు.

బీటీపీ గట్టుపై రోడ్డు అస్తవ్యస్తం

గుమ్మఘట్ట: భైరవానితిప్ప ప్రాజెక్టు రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో వాహనరాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బీటీపీకి అనూహ్యంగా వరదనీరు వచ్చి చేరడంతో డ్యాం పూర్తి స్థాయిలో నిండడంతో జలకళను సంతరించుకుంది. దీంతో బీటీపీని తిలకించేందుకు కర్ణాటక,ఆంధ్రా రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున జనం వస్తున్నారు. గట్టుపై ఉన్న రహదారి గుంతలు పడడంతో వర్షం నీరు చేరుకొని బురదమయంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే పక్కకు వెళ్లేందుకు సైతం వెళ్లలేని పరిస్థితి.

సంక్షిప్త సమాచారం

5,908 మందికి పింఛన్ పంపిణీ

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 6,120 మంది పింఛన్‌దారుల్లో 5,908 మందికి పంపిణీ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.

పశు యజమానులు స్పందించకపోతే చర్యలు

రాయదుర్గంటౌన్: పశు యజమానులు రోడ్లపై తిరుగుతున్న పశువులను తీసుకెళ్లకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతున్న పశువులతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యజమానులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించలేదన్నారు. ఈ నెల 4న సాయంత్రంలోపు వాటిని తీసుకెళ్లాలన్నారు.

ఆలయ పునరుద్ధరణకు రూ.12 లక్షలు

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి బొబ్బర్ల కుంట ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ పనులకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాతలు రూ.12లక్షలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకనటలో తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బలిజ రఘు రూ.5లక్షలు, వడ్డే మారుతీ రూ.5 లక్షలు, వైఎస్సార్‌సీపీ నాయకులు అతావుల్లా రూ.2 లక్షలు అందించినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కూడేరు: అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు వెంకటరమణశెట్టి శుక్రవారం మృతిచెందాడు. ఈనెల 15న బస్టాండ్ ప్రాంతంలో ద్విచక్రవాహనం ఢీకొని వెంకటరణశెట్టి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



బెళుగుప్ప: మండల కేంద్రంలోనిబీసీ కాలనీలో నివాసం ఉంటున్న సన్‌రైజస్ పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, నాగమణి దంపతుల ఇంట గురువారం దీపావళి పర్వదినాన బ్రహ్మ కమళాలు విరబూశాయి. పండుగ పూట విరబూసిన బ్రహ్మ కమళాలకు పూజలు నిర్వహించా రు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండకు చెందిన సిద్ధార్థ భార్య భవాని ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. భర్త , స్థానికులు మంటలు ఆర్పి ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యాయత్నానికి కారణమని సమాచారం.

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి

బొమ్మనహాళ్: గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడం వల్ల దోమల బెడదను తగ్గించొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మీ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమాదేవి, శశికల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మారెమ్మ జ్యోతుల ప్రదర్శన



మారెమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కూడేరు: కూడేరులో పీర్ల మసీదు వద్ద ఉన్న మారెమ్మ దేవత జ్యోతుల ప్రదర్శన గురువారం రాత్రి కనుల పండువగా సాగింది. కూడేరుకు చెందిన నేసే శివ ప్రసాద్ తన మొక్కు తీరడంతో జ్యోతుల ప్రదర్శన చేయించాడు.

పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న పోలీసులు



వ్యాసరచన పోటీల్లో విజేతలు

ఉరవకొండ: పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదని అర్బన్ సీఐ సురేష్‌బాబు అన్నారు. గురువారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. పోలీసు సిబ్బంది, ప్రజలతో కలిసి సీఐ ర్యాలీ చేశారు. ఏఎస్ఐ శ్రీశైలం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక శ్రీనివాస విద్యానికేతన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ శివ ఆధ్వర్యంలో శుక్రవారం బహుమతులు అందించారు. హర్షవర్ధన్, వర్ధన్, లావణ్యకు ఎస్ఐ శివ అందించారు. కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్ఎం సుమ, ఉపాధ్యాయులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా దీపావళి సంబరాలు



కుందుర్పిలో రేణుకా యల్లమ్మ



బొమ్మనహాళ్‌లో లక్ష్మీపూజ



బెళుగుప్పతండాలోని మహాలక్ష్మి అమ్మవారు



కంబదూరులో టపాసులను కాలుస్తున్న దృశ్యం



బెళుగుప్పలో ఇంటిల్లిపాది టపాసులు కాలుస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని ప్రసిద్ధ ఆలయాల్లో దీపావళి పర్వదినం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఏటా ఇష్ట దైవాన్ని పూజించి రాత్రిళ్లు దీపారాధనలు చేశారు. నాగేపల్లి రేణుకా యల్లమ్మ, కుందుర్పి లక్ష్మీనృసింహ ఆలయం, వడ్డేపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి ఆలయం, తూముకుంట హరిహరేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాలు నిర్వహించారు.

బొమ్మనహాళ్: మండలంలోని వివిధ గ్రామాల్లో దీపావళి పండుగను జరుపుకున్నారు. కలశాలు, ప్రతిమలు ఉంచి పూజలు చేశారు. దుకాణాల్లో భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజలు నిర్వహించారు.

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో దీపావళి పర్వదినాన ప్రధాన ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెళుగుప్ప తండాలోని మహాలక్ష్మి ఆలయంలో లక్ష్మీదేవి పూజలను ఘనంగా నిర్వహించారు. బెళుగుప్పలోని కన్యకాపరమేశ్వరి, కొల్హాపురి మహాలక్ష్మి దేవి, గౌరసంద్ర మారెమ్మ, బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

కంబదూరు: మండలంలో దీపావళి పండుగను ఇంటింటా ఘనంగా జరిగాయి. గురువారం ఉదయమే ఆయా ఆలయల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఇళ్ల వద్ద దీపాలను వెలిగించి, పెద్దలు, పిల్లలందరూ టపాసులను కాలుస్తూ, సంబరాలు జరుపుకున్నారు.